


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 08-12-2025 | సంపుటి - 26 | సంచిక -201 | రూ : 4 | పేజీలు: 8




2లో

## డిసెంబరు 9న విజయ్ దివస్..

రాష్ట్రవ్యాప్త సంబరాలకు పిలుపునిచ్చిన కేటీఆర్

## నిన్నటి వరకు ఒక లెక్క..
# గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క

- కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సందేశం
- హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం
- యువతకు కొలువులు, రైతులకు దన్ను, మహిళలకు భరోసా ఇచ్చామన్న ముఖ్యమంత్రి
- తెలంగాణను దేశ గ్రోత్ ఇంజిన్‌గా మార్చడమే లక్ష్యమని స్పష్టీకరణ
- గ్లోబల్ సమ్మిట్ తర్వాత తెలంగాణలో కొత్త లెక్క మొదలవుతుందని వ్యాఖ్య



2లో

## గోవా అగ్నిప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని విచారం

ఎక్స్‌గ్రేషియా ప్రకటన



2లో



2లో

కేసీఆర్ పోయి
## రేవంత్ వచ్చారంతే..
అందులో మాత్రం మార్పేమీ లేదు

: కిషన్ రెడ్డి

- ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనన్న కిషన్ రెడ్డి
- హామీల అమలుపై చర్చకు రావాలంటూ సీఎం రేవంత్‌కు సవాల్

## గోవా నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం

### 25 మంది మృతి

- సిలిండర్ పేలడంతో దుర్ఘటన
- మృతుల్లో నలుగురు పర్యాటకులు, మిగతావారు క్లబ్ సిబ్బంది
- ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించిన సీఎం
- భద్రతా లోపాలే కారణమని అనుమానం

2లో



## ఆ 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మారాలి..



2లో

- ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష నిర్వహించిన చంద్రబాబు
- జగన్ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న సీఎం
- ఆర్ఎస్ఎస్ తరహాలో క్యాడర్‌ను సిద్ధం చేసుకోవాలని పిలుపు
- విద్యార్థుల కోసం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం



2లో

హైదరాబాదులో అమెరికా కాన్సులేట్ రోడ్డుకు
## డొనాల్డ్ ట్రంప్ పేరు

- గ్లోబల్ సమ్మిట్ వేళ కీలక నిర్ణయాలు
- హైదరాబాద్‌లో ట్రంప్, గూగుల్ పేర్లతో వీధులు
- విప్రో, మైక్రోసాఫ్ట్ పేర్లపైనా భవిష్యత్తులో పరిశీలన
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ప్రభుత్వ ప్రకటన

# హైదరాబాదులో అమెరికా కాన్సులేట్ రోడ్డుకు డొనాల్డ్ ట్రంప్ పేరు

తెలంగాణను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే వ్యూహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనలు చేసింది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి వెళ్లే రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ఆదివారం నిర్ణయించింది. ఈ రహదారిని ఇకపై 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా పిలవనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదన గురించి కేంద్ర విదేశాంగ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి త్వరలోనే లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నిర్ణయంతో పాటు మరికొన్ని కీలక రహదారులకు కూడా ప్రముఖుల, సంస్థల పేర్లను ఖరారు చేశారు. రావిర్యాల వద్ద నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డును, ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డును కలిపే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టనున్నారు. ఇప్పటికే రవిర్యాల వద్ద ఉన్న ఇంటర్‌ఛేంజ్‌కు 'టాటా ఇంటర్‌ఛేంజ్' అని పేరు ఉన్న విషయం తెలిసిందే. అదేవిధంగా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో గూగుల్ నిర్మిస్తున్న భారీ క్యాంపస్ సమీపంలోని రహదారికి 'గూగుల్ స్ట్రీట్' అని నామకరణం చేయనున్నారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ముఖ్యమైన రోడ్లకు ప్రపంచస్థాయి కార్పొరేషన్ల పేర్లు పెడతామని ప్రకటించారు. దానికి అనుగుణంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తులో 'మైక్రోసాఫ్ట్ రోడ్', 'విప్రో జంక్షన్' వంటి పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం నుంచి హైదరాబాద్ సమీపంలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ముందు ఈ ప్రకటనలు వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44 దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.

### రాష్ట్రవ్యాప్త సంబరాలకు

## పిలుపునిచ్చిన కేటీఆర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెలువడిన చారిత్రక దినమైన డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా 'విజయ్ దివస్' వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఫలించిన రోజును పండుగలా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నాయకులతో సమావేశమైన కేటీఆర్, ప్రతి నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ స్థాయిలో సంబరాలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో డిసెంబర్ 9 ఒక మైలురాయి అని, ఆ రోజును ప్రజలందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ 2009 నవంబర్ 29న నిరాహార దీక్ష ప్రారంభించగా, తీవ్రమైన ఉద్యమ ఒత్తిడి నేపథ్యంలో 10 రోజుల తర్వాత డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని స్మరించుకుంటూ వేడుకలు జరపాలని కేటీఆర్ తెలిపారు. "తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం చేసిన పోరాట ఫలితాలు మనకు గర్వకారణం. దీక్ష ద్వారా సాధించిన విజయాన్ని జరుపుకుందాం" అని ఆయన అన్నారు. ఈ వేడుకల నిర్వహణ కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తోంది. పార్టీ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

### నిన్నటి వరకు ఒక లెక్క...

## రేపటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క

సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ప్రతిష్ఠాత్మక 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగే ఈ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు తరలివస్తుండటంతో నగరం ఆధునిక హంగులను సంతరించుకుంది. ఈ కీలక తరుణంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు హృదయపూర్వక సందేశాన్ని అందించారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరిస్తూ, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. "జాతి కోసం... జనహితం కోసం... గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలి... గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలి" అంటూ తన సందేశాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, గత రెండేళ్లుగా అహర్నిశలు శ్రమించి తెలంగాణను ప్రగతి శిఖరాలపై నిలబెట్టేందుకు తపించానని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమైన వ్యవస్థలను సరిదిద్ది, నిరుద్యోగ యువతకు కొలువుల జాతరతో కొత్త భరోసా కల్పించామని తెలిపారు. రుణభారంతో కుంగిపోయిన రైతులకు అండగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థికంగా చేయూతనివ్వడంతో పాటు, కేవలం కొద్దిమందికే పరిమితమైన వ్యాపార రంగాన్ని బలోపేతం చేశామని వివరించారు. సామాజిక న్యాయం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, బలహీన వర్గాల వందేళ్ల ఆకాంక్ష అయిన కులగణన చేపట్టామని, మాదిగ సోదరుల దశాబ్దాల ఉద్యమానికి ఎస్సీ వర్గీకరణ ద్వారా న్యాయం చేశామని తెలిపారు. విద్యను బతుకుదెరువుకు బ్రహ్మాస్త్రంగా భావించి, 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల' నిర్మాణానికి పునాదులు వేశామని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం అనే మూల సిద్ధాంతాలతో ముందుకు సాగుతూ, ప్రజాకవి అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతానికి రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తింపునిచ్చామని చెప్పారు. ఈ రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నధాన్యాలకు రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చే పథకాలు తమ పాలనకు నిదర్శనాలని అన్నారు. కేవలం నేటి అవసరాలు తీర్చడమే కాకుండా, 2047 నాటికి స్వతంత్ర భారతావని వందేళ్ల మైలురాయికి చేరేనాటికి తెలంగాణ ఎలా ఉండాలనే దానిపై లోతైన అధ్యయనంతో ఒక మార్గదర్శక పత్రాన్ని సిద్ధం చేశామని వెల్లడించారు. "గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు ప్రాణం పోసి, #TelanganaRising ప్రణాళికలతో ప్రపంచ వేదికపై రీసౌండ్ చేయడానికి సిద్ధమయ్యాం. నిన్నటి వరకు ఒక లెక్క... రేపటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క" అని సీఎం తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలు ఇచ్చిన ఓటు, వారి ఆశీర్వాదాలే తనకు ధైర్యాన్ని, సంకల్పాన్ని ఇచ్చాయని, వారి ప్రేమాభిమానాలే తనకు సర్వస్వమని తెలిపారు. "తెలంగాణ నాకు తోడుగా ఉన్నంత వరకు... ఈ గొంతులో ఊపిరి ఉన్నంత వరకు... 'TELANGANA RISING'కు తిరుగు లేదు" అని తన సందేశాన్ని ముగించారు.

### గోవా అగ్నిప్రమాదంపై

## రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ విచారం

గోవాలోని ఓ ప్రముఖ నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా ప్రాంతంలో ఉన్న బిర్చ్ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మృతుల్లో 16 మంది క్లబ్ సిబ్బంది, ముగ్గురు మహిళలు, నలుగురు పర్యాటకులు ఉన్నారు. కొందరు మంటల్లో చిక్కుకుని మరణించగా, ఎక్కువ మంది దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇది చాలా బాధాకరమైన సంఘటన అని అన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### కేసీఆర్ పోయి రేవంత్ వచ్చారంతే...

## అందులో మాత్రం మార్పేమీ లేదు: కిషన్ రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని, ఈ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ 'రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన' పేరుతో ఆదివారం మహా ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలపై ఒక చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని ఎలా దోచుకుందో చూశామని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ అదే జరుగుతోందని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల రాష్ట్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం చేశారని 'ప్రజా పాలన' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. "కేసీఆర్ పోయి రేవంత్ రెడ్డి వచ్చారంతే.. పాలనలో, దోపిడీలో ఎలాంటి మార్పు లేదు" అని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదని సీఎంను నిలదీశారు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ వంటి హామీల గతి ఏమైందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బెల్ట్ షాపులను రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు మద్యం అమ్మకాలతో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. ఈ రెండేళ్లలో ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే, తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ ధర్నాలో బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నమ్మించి మోసం చేశారు...

## సోషల్ మీడియాలో భక్తుడి పోస్ట్

దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత అక్షరధామ్ ఆలయం వద్ద ఓ వ్యక్తి ఘరానా మోసానికి గురయ్యాడు. పూజారి వేషంలో ఉన్న వ్యక్తిని నమ్మి సుమారు రూ.1.8 లక్షల విలువైన వస్తువులను పోగొట్టుకున్నాడు. ఈ మోసం జరిగిన తీరును బాధితుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ రెడ్డిట్‌లో పంచుకుంటూ, ఇతర భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాడు. వివరాల్లోకి వెళితే, బాధితుడు ఒంటరిగా అక్షరధామ్ ఆలయానికి బస్సులో వెళుతుండగా, ఓ వృద్ధుడు పరిచయమయ్యాడు. ఎంతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మాట్లాడుతూ బాధితుడి నమ్మకాన్ని చూరగొన్నాడు. ఆలయంలోని క్లోక్‌రూమ్ సురక్షితం కాదని, గతంలో తాను అక్కడే తన ఫోన్, పర్స్ పోగొట్టుకున్నానని నమ్మబలికాడు. తన వస్తువులను భద్రపరచడానికి తనకు నమ్మకమైన వ్యక్తి ఉన్నాడని చెప్పి, ఫోన్ చేసి పిలిపించాడు. కొద్ది నిమిషాల్లోనే పూజారి దుస్తుల్లో ఉన్న మరో వ్యక్తి అక్కడికి చేరుకున్నాడు. బాధితుడికి తిలకం దిద్ది, మీ వస్తువులు ఇక్కడ భద్రంగా ఉంటాయని భరోసా ఇచ్చాడు. నమ్మకం కలిగించేందుకు, ఆ వృద్ధుడు ముందుగా తన ఫోన్, పర్సును ఆ నకిలీ పూజారికి అప్పగించాడు. ఇది చూసిన బాధితుడు, తనలో ఉన్న అనుమానాన్ని పూర్తిగా పక్కనపెట్టి, తన శాంసంగ్ ఎస్24 అల్ట్రా ఫోన్, స్మార్ట్‌వాచ్, రూ.8,000 నగదు ఉన్న పర్సు, క్రెడిట్, డెబిట్ కార్డులు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి విలువైన వస్తువులన్నీ వారికి ఇచ్చాడు. అనంతరం, ఆ వృద్ధుడితో కలిసి ఆలయంలోకి వెళ్లి ప్రశాంతంగా దర్శనం చేసుకున్నాడు. బయటకు వచ్చాక, ఆ వృద్ధుడు బాధితుడికి ఒక లడ్డూ ఇచ్చి, "కొంత డబ్బు డిపాజిట్ చేసి వస్తాను, ఇక్కడే ఉండు" అని చెప్పి వెళ్ళాడు. నిమిషాల వ్యవధిలోనే ఆ వృద్ధుడు, నకిలీ పూజారి ఇద్దరూ మాయమయ్యారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ తరహా వ్యవస్థీకృత మోసాలు ప్రధాన పుణ్యక్షేత్రాల వద్ద సాధారణంగా జరుగుతుంటాయని పోలీసులు తెలిపినట్లు బాధితుడు పేర్కొన్నాడు. మోసగాళ్లు అనుమానాస్పదంగా కాకుండా, ఎంతో నమ్మకంగా, మర్యాదగా ప్రవర్తిస్తారని, ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులను నమ్మి విలువైన వస్తువులను ఇవ్వొద్దని, కేవలం అధికారిక క్లోక్‌రూమ్‌లను మాత్రమే ఉపయోగించాలని అతడు ఇతరులకు సూచించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆ 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మారాలి: చంద్రబాబు హెచ్చరిక

తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలలో మెజారిటీ సభ్యుల పనితీరు మెరుగుపడిందని, అయితే మరో 37 మంది పనితీరు మరింత మెరుగుపడాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో ఉన్న నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమీక్షలు, వన్ టూ వన్ భేటీల ద్వారా చాలామంది పనితీరులో మార్పు వచ్చిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై నాలుగైదు మార్గాల్లో కచ్చితమైన సర్వే నివేదికలను తెప్పించుకుంటున్నట్లు చంద్రబాబు గుర్తుచేశారు. ఈ నివేదికల ఆధారంగానే పనితీరును అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇదే సమావేశంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్ విషయాన్ని కొందరు నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ "నెలకోసారి వచ్చి విజ్ఞత కోల్పోయి మాట్లాడే వారి మాటలకు విలువ లేదు. అర్థం పర్థం లేని మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రజలే వారికి బుద్ధి చెబుతారు" అని వ్యాఖ్యానించారు. అనంతరం పార్టీ క్యాడర్ నిర్మాణంపై మాట్లాడుతూ.. ఎలాంటి పదవులు ఆశించకుండా బీజేపీ కోసం ఆర్ఎస్ఎస్ నిస్వార్థంగా పనిచేస్తోందని, అదే స్ఫూర్తితో టీడీపీ కార్యకర్తలను కూడా సైద్ధాంతికంగా బలోపేతం చేయాలని సూచించారు. అలాగే, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 'స్కూల్ ఇన్నోవేటివ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్' అనే కార్యక్రమాన్ని రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ భాగస్వామ్యంతో చేపడదామని పిలుపునిచ్చారు.

## గోవా నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 25 మంది మృతి

గోవాలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఉత్తర గోవాలోని అర్పోరా గ్రామంలో ఉన్న ఓ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. వంటగదిలో సిలిండర్ పేలడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రాజధాని పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'బర్చ్ బై రోమియో లేన్' అనే నైట్‌క్లబ్‌లో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో నలుగురు పర్యాటకులు ఉండగా, మిగిలిన వారంతా క్లబ్ సిబ్బంది అని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. ముగ్గురు వ్యక్తులు మంటల్లో సజీవదహనం కాగా, 20 మంది పొగకు ఊపిరాడక చనిపోయారని పోలీసులు వెల్లడించారు. ప్రమాద వార్త తెలియగానే ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, స్థానిక ఎమ్మెల్యే మైఖేల్ లోబోతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ దుర్ఘటనపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించినట్లు ప్రకటించారు. క్లబ్‌లో భద్రతా ప్రమాణాలు పాటించలేదని ప్రాథమికంగా తెలిసిందని, విచారణలో నిర్లక్ష్యం బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు ఇచ్చిన అధికారులను కూడా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోని అన్ని నైట్‌క్లబ్‌లలో తనిఖీలు చేపడతామని, అనుమతులు లేని వాటి లైసెన్సులు రద్దు చేస్తామని ఎమ్మెల్యే మైఖేల్ లోబో తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతేడాది ప్రారంభమైన ఈ క్లబ్‌లో ఇంత పెద్ద ప్రమాదం జరగడం స్థానికంగా కలకలం రేపింది.

## స్పీకర్‌కు హరీశ్ రావు ఘాటు లేఖ... ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై ఫైర్

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ఘాటు లేఖ రాశారు. గడిచిన రెండేళ్లుగా శాసనసభలో తీవ్రమైన లోపాలు జరుగుతున్నాయని, ఇది శాసనసభ రాజ్యాంగబద్ధమైన విశ్వసనీయతను దెబ్బతీస్తోందని ఆయన ఆరోపించారు. స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ లేఖను విడుదల చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై హరీశ్ రావు తన లేఖలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 10 మంది ఎమ్మెల్యేలపై తాము పిటిషన్లు దాఖలు చేసినా, వాటిపై నిర్ణయం తీసుకోకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2)ను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర హెచ్చరికలను కూడా ఆయన గుర్తుచేశారు. "ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్" అన్న చందంగా ఎమ్మెల్యేల పదవీకాలం ముగిశాక తీర్పు ఇస్తే ప్రయోజనం ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు.



# లేబర్ కార్డ్ ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అనేక ప్రయోజనాలు చేకూరుతాయి

*** జై హనుమాన్ వడ్డెర సంఘం అధ్యక్షుడు పల్లపు శ్రీనివాస్**

ప్రజాస్ఫూర్తి, కాప్రా: . లేబర్ కార్డ్ ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు, వంటి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జై హనుమాన్ వడ్డెర సంఘం అధ్యక్షుడు పల్లపు శ్రీనివాస్ అన్నారు. జై హనుమాన్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మరొక ముఖ్యమైన ప్రజాసేవా కార్యక్రమం ఆదివారం చర్లపల్లిలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పల్లపు శ్రీనివాస్ నేతృత్వంలో ప్రాంతానికి చెందిన సుమారు 70 మంది కార్మికులకు లేబర్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డులు పనిజీవితంలో రక్షణ, భద్రత కలిగిన సదుపాయాలు లభించనున్నాయి.రోజువారీ కూలీలు, వడ్డెర కమ్యూనిటీకి చెందిన కార్మికులు చాలామంది ప్రభుత్వ పథకాలు, హక్కుల గురించి తెలియక వంచితులవుతున్నారని, ఇలాంటి సమస్యలను నివారించేందుకు ఈ కార్డుల జారీకి సంఘం




ముందుకొచ్చిందని తెలిపారు. సంఘం తరఫున స్థానిక కార్మికుల వివరాలు సేకరించి, అవసరమైన పత్రాలు సిద్ధం చేసి, సంబంధిత శాఖలతో నిరంతరం ఫాలోఅప్ చేయడం ద్వారా ఈ కార్డులు జారీ అయ్యాయన్నారు. ఇకపై మరింతమంది కార్మికులకు ఈ సదుపాయాలు అందేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు, కూలీ కార్మికులు పాల్గొని పల్లపు శ్రీనివాస్ సేవాభావాన్ని అభినందించారు.

## మనలోని దుర్గుణాలను వదిలి సన్మార్గం వైపుగా నడిపేదే అయ్యప్ప దీక్షా

*** ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, చామకూర మల్లారెడ్డి లు**



జీడిమెట్ల , (ప్రజాస్ఫూర్తి) : మనలోని దుర్గుణాలను వదిలి సన్మార్గం వైపుగా నడిపేదే అయ్యప్ప దీక్షా అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లు అన్నారు. జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తా లోని టీఎన్ఆర్ నార్త్ సిటీ మాల్ పక్కన గల మైదానంలో తత్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 18 పడులతో మహా పడి పూజ మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్యే మల్లారెడ్డి లు ముఖ్యఅతిథులుగా హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్తవ్యాన్ని ధర్మబద్ధంగా చేయాలని తెలిపేదే అయ్యప్ప తత్వమన్నారు. ఈ కార్యక్రమంలో తత్వమసి సేవా సంఘం సభ్యులు చంద్రం స్వామి, మురళీకృష్ణ స్వామి, జైహింద్ గౌడ్, నాగరాజు స్వామి, కృష్ణారెడ్డి స్వామి, శ్రీధర్ స్వామి, శివకుమార్ స్వామి, కుంట సిద్ధిరాములు గురుస్వామి, కృపాకర్ రాజు స్వామి, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దయా, దీవెనలు ప్రతీ భక్తుడిపై ఉండాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



జీడిమెట్ల , (ప్రజాస్ఫూర్తి) : అయ్యప్ప స్వామి దయా, దీవెనలు ప్రతీ భక్తుడిపై ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతల దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవితానికి ప్రతీఒక్కరూ రోజు కోడి గ్రుడ్డు తప్పక తినాలి

*** సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు**



కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి) : ఆరోగ్యవంతమైన జీవితానికి ప్రతీఒక్కరూ రోజు కోడి గ్రుడ్డు తప్పక తినాలి అని సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు అన్నారు. ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి ఎంఎల్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ను సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు తో కలిసి బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం సమృద్ధిగా ఉన్న చౌకైన ఆహారం గ్రుడ్డు అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చుంచుపల్లి మండలంలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

కాంగ్రెస్ పార్టీలో చేరిన యువజన నాయకులు బాచిరెడ్డి

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ఎంపీ రామ సహాయం రఘు రామరెడ్డి ఆధ్వర్యంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో అలాగే ఊకంటి గోపాలరావు, వీరబాబు, కంచర్ల చంద్రశేఖర్, ఆల మురళి, జేవీఎస్ చౌదరి, తూమ్ చౌదరి, కోనేరు చిన్ని నాగ సీతారాములు, డిసిసి తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు బాచి రెడ్డి కాంగ్రెసులో చేరారు. చుంచుపల్లి మండలంలో మండలంపై పట్టు ఉన్న యువ నాయకుడు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బిగ్ షాక్ తగిలినట్టు అయ్యింది. ఆదివారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో బాచి రెడ్డి మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా గ్రామస్థాయి నుండి కష్టపడి పార్టీని బలోపేతం చేసినప్పటికీ పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో తన అనుచరులు 100 కుటుంబాలతో కాంగ్రెస్లో చేరినట్లు తెలిపారు. టిఆర్ఎస్ పతనం గ్రామాలనుంచే మొదలైందని, టిఆర్ఎస్పై ప్రజలకు నమ్మకం పోయిందని పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం కోసం ఎదురుచూస్తుందని, టిఆర్ఎస్ ప్రభుత్వంలో షో చేయడం తప్ప పనులు చేసే పరిస్థితి కనపడటం లేదని, సుభిక్షంగా ఉన్న గ్రామాలు నేడు వెలవిలలాడుతున్నాయని కన్నెత్తి చూసేవాడే లేదని ఆయన అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితునై, అపతకాలను గ్రామస్థాయి నుండి కష్టపడి గ్రామ సర్పంచ్లను గెలిపించే బాధ్యతను తన భుజాలపై వేసుకొని గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు




## మతసామరస్యానికి ప్రతీకగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదయాలను అభివృద్ధి పరుస్తాం

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, ( ప్రజాస్ఫూర్తి) : మతసామరస్యానికి ప్రతీకగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదయాలను అభివృద్ధి పరుస్తామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నూతనంగా నిర్మించిన మస్జిద్ ఈ మెహబూబున్నిస బేగం , మెహబూబా అక్తారి మస్జిద్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో అన్నీ వర్గాల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ మతసామరస్యానికి ప్రతీకగా ప్రార్ధన మందిరాలను నిర్మించుకునేలా స్థలాన్ని కేటాయింపచేస్తూ అభివృద్ధి పరుస్తామన్నారు. అనంతరం మస్జిద్ లో ప్రారంభోత్సవ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణా యాదవ్, సాయి యాదవ్, పాక్స్ డైరెక్టర్ వెంకటేష్, కమిటీ సభ్యులు మహమ్మద్ నయ్యర్ సాబ్, ఎండీ.రాహత్ అలీ, షేక్ గౌస్, మహమ్మద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.



## చర్ల–దుమ్ముగూడెం మండలాల్లో ఎన్నికల వ్యయ పరిశీలకులు లావణ్య పర్యటన

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల వ్యయ నియంత్రణలో భాగంగా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లావణ్య , ఎక్స్పెండిచర్ నోడల్ ఆఫీసర్ ఏ.వీ. రెడ్డి ఆదివారం దుమ్ముగూడెం , చర్ల మండలాల్లో పర్యటనలు నిర్వహించారు.ముందుగా అధికారులు దుమ్ముగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాన్ని సందర్శించి, పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, ఎన్నికల వ్యయ నమోదు రిజిస్టర్లు, షాడో రిజిస్టర్, రసీదులు లావాదేవీల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. వ్యయ పరిమితుల అమలు, పత్రాల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శక విధానాలపై సంబంధిత సిబ్బందికి సూచనలు అందజేశారు.తరువాత అధికారులు చర్ల మండలంలో కూడా వ్యయ రికార్డులను పరిశీలించి, అనంతరం పోటీ చేస్తున్న అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభ్యర్థులు ఎన్నికల వ్యయ నియమావళిని కచ్చితంగా పాటించాలని, ప్రతి ఖర్చు లావాదేవీని తగిన ఆధారాలతో నమోదు చేయాలని, సమయానుసారంగా రిపోర్టులు సమర్పించాలని అధికారులు స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, ఏవైనా లోపాలు ఉన్నపక్షంలో తక్షణమే సరిదిద్దాలని అధికారులు తెలిపారు.ఈ పర్యటనలో ఎలక్షన్ ఎక్స్పెండిచర్ టీములు, ఎంపీడీవో సిబ్బంది, సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు.

## సిసి కెమరాలతో నేరాల నియంత్రణ

*** ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**

*** ఎల్లమ్మ తల్లి ఆలయంలో 4 సిసి కెమరాలు ప్రారంభం**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: సిసి కెమరాలతో నేరాలను నియంత్రించవచ్చని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని సేవాలాల్ తండాలో గల ఎల్లమ్మ తల్లి ఆలయంలో గౌడ కులస్తులు ఏర్పాటు చేసిన 4 సిసి కెమరాలను ఎస్ఐ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఏదైనా నేరం జరిగినప్పుడు అక్కడ సిసి కెమరాల ఉంటే నేరస్తులను సులువుగా గుర్తించవచ్చని, తద్వారా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు. ప్రధాన కూడళ్లు, గుడులు, వ్యాపార కేంద్రాల వద్ద సిసి కెమరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. శాంతి భద్రత పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గౌడ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు

*** ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**

*** బెల్ట్ షాపులో 10.440 లీటర్ల మద్యం స్వాదీనం, నిర్వహకునిపై కేసు నమోదు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బెల్ట్ షాపు నిర్వహకులు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో గల బెల్ట్ షాపుపై ముస్తాబాద్ పోలీసులు రైడ్ చేశారు. 10.440 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిర్వహకుడు నారాయణపురం చంద్రంపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సందర్భంలో బెల్ట్ షాపుల్లో ఎలాంటి మద్యం అమ్మకాలు జరిపిన చట్టపరంగా చర్యలు తీసుకొని, నిర్వహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, మద్యం, డబ్బు రవాణాపై ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలియజేయాలన్నారు.

## ప్రజాస్ఫూర్తి కథనానికి స్పందన

*** కరెంటు బిల్లులో సవరణ..**

*** సాంకేతిక లోపం కారణంగానే అధిక బిల్లు: అధికారులు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : గుండెలు గుబేలుమనేలా వచ్చిన కరెంటు బిల్లును విద్యుత్ శాఖాధికారులు సవరించారు. కొత్తగూడెం పట్టణంలోని ఓ ఐస్క్రీమ్ షాపునకు శనివారం ఇచ్చిన కరెంటు బిల్లు రూ.12,35,191 లుగా రావడంతో సదరు షాపు యజమాని దానిని వాట్సప్ స్టేటస్గా పెట్టుకోవడంతో ప్రజాస్ఫూర్తి దినపత్రికలో కరెంట్ బిల్లు.. గుండె జల్లు అనే శీర్షికతో ప్రస్తుతమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు.. దీంతో ఆదివారం విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. హుటాహుటిన షాపు వద్దకు చేరుకుని తిరిగి కొత్త బిల్లును ఇచ్చారు. సవరించిన బిల్లులో రూ.55,550లు వచ్చింది. కాగా బిల్లులు ఇచ్చే మిషన్లో సాంకేతిక లోపం కారణంగానే ఎక్కువ బిల్లు వచ్చిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యుత్ శాఖాధికారులు చెప్పారు. వినియోగదారులు ఎవరికైనా ప్రతినెల వచ్చే బిల్లుకంటే అధిక బిల్లు వస్తే విద్యుత్ శాఖాధికారులను సంప్రదించాలని, సమస్యను పరిశీలించి, సాంకేతిక లోపం కారణంగా బిల్లు అధిక మొత్తంలో వస్తే సవరిస్తామని వివరించారు.

# కాదులూరు సర్పంచ్‌గా ఆశీర్వదించండి..

* **మంత్రి దామోదర్ సహకారంతో అభివృద్ధి చేసి చూపిస్తా...**
* **ఫుట్‌బాల్ గుర్తును గుర్తించుకొని ఓటేయండి ...**
* **సర్పంచ్ అభ్యర్థి బోయిని స్వరూప రాణి..**

అందోలు, ప్రజాస్ఫూర్తి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ధ్యేయంగా గ్రామం కోసం మీ సేవకుడిగా పని చేస్తానంటూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కాదులూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థి బోయిని స్వరూప నర్సింలు ప్రచార పర్వాని సాగిస్తున్నారు. ప్రచారంలో భాగంగా ప్రజలను ఆప్యాయంగా పలురిస్తూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ మీ సమస్యలే నా సమస్యలుగా భావించి నిరంతరం ప్రజాసేవ కొరకు కృషి చేస్తానని, అన్ని రంగాల వర్గాల వారికి అనుకూలంగా సేవలందిస్తానని, కుల మత జాతి విభేదాలు లేకుండా అందరిని సమాన దృక్పథంతో ప్రతి ఒక్కరిని ఆత్మగౌరవంతో సమాజ సేవకు ముందుకు వస్తానంటూ ఓటర్లను చెబుతున్నారు. మీరందరూ పెద్ద మనసు చేసుకొని సర్పంచ్ గా గెలిపిస్తే అనేక అభివృద్ధి పనులు చేయిస్తాననీ, రాజకీయంగా, ఆర్థికంగా, సమాజ సేవకు ముందుండి సేవ చేయడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిస్వార్థ రాజకీయాలకు తావు లేకుండా నిస్వార్థమైన సేవలను అందించడంలో ముందు ఉంటానని, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని ప్రజలకు ప్రజలకు విజ్ఞప్తి చేస్తునానరు. ప్రతి కుటుంబానికి మేలు చేసేలా గ్రామంలోనే ఉంటూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానన్నారు గ్రామ అభివృద్ధికి



కట్టుబడి ఉంటానని మీ ఆశీర్వాదమే నా గెలుపుకు లక్ష్యం అంటూ ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఆశతో ఉన్నవారికి అధికారం ఇస్తే దోచుకుంటారు. ఆలోచనతో ఉన్న వారికి అధికారం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారని ప్రజలకు వివరిస్తున్నారు.

* **మంత్రి సహకారంతో అభివృద్ధి చేస్తా..**

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బోయిని స్వరూప రాణి పెద్ద ఎత్తున తన మద్దతు దారులతో కలిసి ఇంటింట ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రజల నుండి పలు సమస్యలను అగిడి తెలుసుకుంటూ ఎన్నికల అనంతరం వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. రోడ్ల నిర్మాణం, యువత అభివృద్ధి, మహిళ సాధికారత, విద్యా, ఆరోగ్య రంగాల్లో నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని , ముఖ్యంగా మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులతో తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నానని.. మంత్రి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి దిశగా పయనించేలా పెద్ద ఎత్తున నిధులు కెటాయించేలా చూస్తానన్నారు. ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అందరికీ అందుబాటులో ఉండి తనదైన శైలిలో అందరినీ కలుపుకొని పోయి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానంటూ భరోసా కల్పిస్తున్నారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి ) : వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీ లో బాపూజీ స్కూల్స్ చైర్మన్ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజ మహోత్సవంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కర్తవ్యాన్ని ధర్మబద్ధంగా చేయాలని తెలిపేదే అయ్యప్ప తత్వమన్నారు. మనలోని దుర్గుణాలను వదిలి సన్మార్గం వైపుగా నడిపేదే అయ్యప్ప దీక్షా అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు లింగయ్య,శ్రీనివాస్ రెడ్డి,లక్ష్మి నర్సయ్య, లక్ష్మినారాయణ, భారతమ్మ,రమేష్, దుర్గ, యాదగిరి, రాజు ,మల్లేష్, మరియు అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ వారి సేవా సమితి 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాస్ఫూర్తి, కాప్రా : డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ టి ఎస్ ఐ ఐ సి కాలనీ లో ఉన్న లైన్స్ క్లబ్ లో కమ్మ వారి సేవా సమితి కాప్రా అధ్యక్షుడు చల్లపల్లి నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తమ టీచర్ గా రాష్ట్రపతి అవార్డు అందుకున్న కోగంటి రామమోహనరావు , కాప్రా కమ్మ సంఘం అధ్యక్షుడు పొట్లూరి రామకృష్ణ జనాభ్యుదయ సంఘం సెక్రటరీ సోమేశ్వరరావు మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ముప్పాళ్ళ సాంబశివరావు (వెట్ ఇండియా) మండవ ప్రేమచంద్, తార్నాక కమ్మ సంఘం నాయకురాలు మన్నే నాగ మల్లీశ్వరి చేతుల మీదుగా కమ్మ వారి సేవా సమితి కాప్రా 2026 వ సంవత్సరం నూతన క్యాలెండర్ ను ఆవిష్కించారు. ఈ కార్యక్రమంలో కమ్మ వారి సేవా సమితి కప్రా ఉపాధ్యక్షుడు పాటిబండ్ల నాగేశ్వరావు జనరల్ సెక్రటరీ మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీ వెంకటరమణ , ట్రెజరర్ హరనాథ్ బాబు,కమిటీ సభ్యులు హనుమాన్, నరసింహారావు, మాలాద్రి, సుకుమార్, సుబ్బయ్య పరుచూరి పవన్, సజ్జ సత్యనారాయణ, తార్నాక కమ్మ సంఘం సభ్యులు చంద్రమౌళి దేవినేని వెంగబాబు,వాసిరెడ్డి శివ ప్రసాద్, చనుమోలు నాగభూషణం, ఎస్ ఆర్ శ్రీను మరియు కమ్మ సోదరులు పాల్గొన్నారు.

## కోల ఐశ్వరయ్యకు తులాభారం

* **నగదు సూరారం పాఠశాల విద్యార్థుల సంక్షేమానికి..**



(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : రిటైర్డ్ ఉపాధ్యాయులు కోల ఈశ్వరయ్య 85 వ పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యుల మధ్య కోలాహలంగా జరుపుకున్నారు. సురారం లోని వి.ఐ.పి ఫంక్షన్ హాల్ లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్యకు తులాభారం చేశారు. తులాభారంలో వాడిన డబ్బులను విద్యార్థుల సంక్షేమానికి ఇస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వరయ్య పని చేసిన పాఠశాల అభివృద్ధి కోసం నగదును వాడుతామని తెలిపారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను, పెన్నులు పెన్సిళ్లను అందజేయునున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయన కుమారులు రవీందర్ ముదిరాజు, కోలా వెంకటేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అభివృద్ధిలో డాకూరు గ్రామాన్ని అగ్రగామిగా నిలుపుతా..

* **డాకుర్ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి**

అందోలు, ప్రజాస్ఫూర్తి: గ్రామంలో అభివృద్ధికి తన శక్తివంతన లేకుండా కృషి చేస్తానని అందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ తరఫున బలపరిచిన అభ్యర్థి జి. ఆర్. నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అండదండలతో తాను గ్రామాన్ని మరింత అభివృద్ధిగా చేపడుతానని ఆయన అన్నారు. ప్రజలు తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని, ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. సర్పంచ్ గా ఎన్నిక అయిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ సమస్యలు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి నిధులు కూడా గ్రామానికి మంత్రి సహకారంతో ఎక్కువగా తీసుకువచ్చేందుకు ధనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి జీర్ నరేందర్ రెడ్డి పైన తయారుచేసిన పాటలసిడిని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కళాలి రమేష్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, వీరారెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు సంజీవయ్య, అందోల్ మల్లేశం, ముప్పారం పద్మారావు, ప్రభాకర్, అజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## గొలనుకొండ గ్రామాన్ని అభివృద్ధికై..

### కాంగ్రెస్ గొలనుకొండ సర్పంచ్ అభ్యర్థి ఇందూరి యాదిరెడ్డి గెలిపించండి

ఆలేరు, ప్రజా స్ఫూర్తి : గొలనుకొండ గ్రామానికి అభివృద్ధికై సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఇందూరి యాదగిరి రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఉంగరం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గతంలో తనకి ఏ పదవి లేకుండా స్కూల్లో నల్లబల్లాలు, గుడివద్ద అభివృద్ధి కార్యక్రమాలు, తడి చెత్త పొడి చెత్త బకెట్లను ఇలాంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని తనను గెలిపిస్తే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జనగాం ఉపేందర్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళ్తానన్నారు. గ్రామశాఖ అధ్యక్షులు కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యంతో పాటు అనేక సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ప్లాట్ల పంపిణీ జరిగిందన్నారు.కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోరిక మేరకు ఇందూరి యాదగిరి రెడ్డిని బలపరచామని వారి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డ్ మెంబర్లు భైరపాక గణేష్, కొలనుపాక సత్యనారాయణ, గంధ మల్ల లక్ష్మి, బాకీ యాదగిరి, భువనగిరి అండాలు, బందారం సత్యలక్ష్మి, లగ్గాని కవిత,భైరపాక పద్మ, ఇందూరు అంజిరెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్త విమానాశ్రయాలు, రోప్‌వేలకు మార్గం సుగమం

హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు, రోప్‌వేలకు మార్గం సుగమమైందని... వరంగల్, ఆదిలాబాద్, రామగుండంలలో కొత్త విమానాశ్రయాలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వం పేర్కొంది. వచ్చే ఏడాది వరంగల్ విమానాశ్రయం నుంచి కార్గో సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047 నేపథ్యంలో రహదారులుభవనాల శాఖ పరిధిలో రెండేళ్ల పురోగతిపై విడుదల చేసిన నివేదికలో ప్రభుత్వం పలు అంశాలను వివరించింది. 'యాదగిరిగుట్ట, నల్గొండలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్, మంథని రామగిరి కోటకు రోప్‌వేలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. వీటితో పాటు కొత్త ఎక్స్‌ప్రెస్ వేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో సరకు రవాణాలో వేగం పెరిగి, లాజిస్టిక్ ఖర్చులు తగ్గుతాయని' ప్రభుత్వం పేర్కొంది. నివేదికలోని ముఖ్యాంశాలిలా..

* తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికకు అనుగుణంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.60,799 కోట్లతో ప్రకటించిన భారీ ప్రాజెక్టులు అభివృద్ధికి ఊతమిస్తాయని భావిస్తున్నాం.
* 'మిర్రర్ స్మార్ట్' రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాం. హ్యామ్ పద్ధతిలో 419 రోడ్లను రూ.11,399 కోట్లతో 32 ప్యాకేజీలుగా అభివృద్ధి చేయనున్నాం.
* హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లను సరిదిద్దేందుకు రూ.288 కోట్లతో చేపట్టనున్న పనులు ఆమోదం పొందాయి. సుమారు రూ.10,400 కోట్లతో ఆరు వరుసల రహదారి నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమవుతోంది.
* ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు రూ.36 వేల కోట్ల వ్యయమవుతుందని అంచనా వేస్తున్నాం.
* హైదరాబాద్ అమరావతి మచిలీపట్నం రహదారి ఎలైన్‌మెంట్ నిర్ధారణకు డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్ సంస్థ ఎంపికకు టెండర్లు పిలిచాం.

## తూర్పు గూడెం సర్పంచ్ అభ్యర్థి దుప్పటి లక్ష్మి వెంకటేష్ గెలుపు కోరుతూ ప్రచారం



ఆలేరు, ప్రజా స్ఫూర్తి : తూర్పు గూడెం సర్పంచ్ అభ్యర్థి దుప్పటి లక్ష్మి వెంకటేష్ గెలుపు కోరుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. బ్యాట్ గుర్తుకు ఓటేయాలంటూ నినాదాలు చేస్తూ ఓటర్ను అభ్యర్థించారు. తూర్పు గూడెం వార్డు సభ్యులు 1 వార్డ్ దూడల నరేష్,2 వార్డ్ సుదగాని శ్రీవాణి,3 వార్డ్ కొత్తోజు జానమ్మ,4 వార్డ్ ఎదుల సందీప్,5 వార్డ్ చంద్రగిరి అలివేల,6 వార్డ్ అందె సుధాకర్,7వార్డ్ గంగరపు స్టార్విన్,8 వ మదాను దొర్నిస్, గ్రామ పెద్దలు,లింగామయ్య బాలయ్య అంజయ్య ప్రభాకర్ మల్లేష్ జోజప్ప సంపత్ బాల్తారాజ్ రాజయ్య సంపత్ సత్యనారాయణ రవి సరోజన రేణుక గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## పల్లె సంతోష్ గెలుపు కోరుతూ కల్లూరి ప్రచారం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచి అభ్యర్థి పల్లె సంతోష్‌గెలుపు కోరుతూ ఆదివారం టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి ఇంటింట ప్రచారం చేశారు. సర్పంచ్ గా గెలిపిస్తే రఘునాథపురాన్ని మండలంగా ఏర్పాటు చేసేందుకు పోరాటం చేస్తానని పల్లె సంతోష్‌హామీ ఇచ్చారు

## టిఆర్ఎస్ పార్టీ మద్దతు అభ్యర్థి ఎర్రగోకుల గెలుపు కోరుతూ ప్రచారం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ సర్పంచి అభ్యర్థి ఎర్రకోకుల జస్వంత్ గెలుపు కోరుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటేయాలంటూ నినాదాలు చేస్తూ ఓటర్ను అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, పట్టణ అధ్యక్షులు బేడిదే వీరేశం, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాకళ్ల ఉపేందర్ తదితరులున్నారు.

## లాలాపేటలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి

గౌతంనగర్ (హైదరాబాద్): నగరంలోని లాలాపేటలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యువకులు కీసర నుంచి అల్పాహారం కోసం తార్నాక వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతిచెందిన వారిలో హర్షవర్ధన్ అనే యువకుడు మల్కాజ్‌గిరి వాసిగా సమాచారం.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు ముస్తాబైన హైదరాబాద్

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా హైదరాబాద్ నగరం ముస్తాబైంది. ఓ వైపు అత్యాధునిక టెక్నాలజీ హంగులు.. మరోవైపు తెలంగాణ ప్రత్యేక ఆకర్షణల మేళవింపుతో ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రముఖ ప్రదేశాలు, చెరువులు, రహదారులు, సమిట్ వేదిక.. ఇలా అన్ని చోట్లా హైటెక్ ప్రొజెక్షన్లు, డిజిటల్ రూపంలో ప్రదర్శనలు, ఆధునిక విజువల్ ఎఫెక్టులతో ప్రత్యేకంగా పెట్టుబడుల పండగ వాతావరణం సృష్టించారు. చార్మినార్, కాచిగూడ రైల్వే స్టేషన్ భవనంపై ప్రత్యేక లైటింగ్ ప్రొజెక్షన్ ఏర్పాటు చేసి నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని





చూపించనున్నారు. సచివాలయం వద్ద త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్‌తో రాష్ట్ర అభివృద్ధి తీరును, భవిష్యత్ లక్ష్యాలను ఆకర్షణీయంగా చూపించడానికి ప్రణాళిక రూపొందించారు. రైజింగ్ తెలంగాణ విజన్ 2047 లక్ష్యాలు అందరికీ అర్థమయ్యే రీతిలో డిస్ ప్లేలు ఏర్పాటు చేశారు. దుర్గం చెరువులో ప్రత్యేక ఆకర్షణగా గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రొజెక్షన్.. ఇందులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ లోగోను ఇన్‌లిట్ టెక్నిక్‌తో ప్రదర్శించనున్నారు. హుస్సేన్ సాగర్‌లో వాటర్ ప్రొజెక్షన్ ద్వారా భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువతరైతు ప్రధాన కార్యక్రమాలు, 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం వంటి ముఖ్య అంశాలను ప్రదర్శించనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమిట్ వేదిక వరకు వెళ్లే రోడ్డుపై భారీ డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ స్క్రీన్లపై భారత్ ఫ్యూచర్ సిటీకి ఎలా చేరుకోవాలి.. ఎంత దూరం.. వంటి వివరాలు పొందుపరిచారు. నగర వ్యాప్తంగా గ్లోబల్ సమిట్ లోగోతో తయారు చేయించిన 1500 రంగురంగుల జెండాలతో వేడుక వైభవాన్ని చాటనున్నారు. హైదరాబాద్ నగరంలో పది వేర్వేరు ప్రదేశాల్లో ప్రత్యేక సమాచార స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ గ్లోబల్ సమిట్‌కు సంబంధించిన వివరాలు, ఫ్యూచర్ సిటీ ప్రణాళిక, డిజిటల్ స్క్రీన్లపై విజువల్స్, సమిట్ బ్రోచర్లు అందుబాటులో ఉంచనున్నారు. వాలంటీర్లు ప్రజలకు సమిట్ డైలీ షెడ్యూల్‌ను వివరించి అవగాహన కల్పించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.




## రెండో విడత పంచాయతీ ఎన్నికల్లు..
# 415 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవం

రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 415 మంది సర్పంచ్‌లు, 8,304 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అత్యధికంగా కామారెడ్డిలో 44, నల్గొండ, నిజామాబాద్‌లో 38 చొప్పున ఏకగ్రీవమయ్యాయి. రెండో విడతలో 4,332 పంచాయతీలు, 38, 322 వార్డుల్లో ఎన్నికల కోసం ఎస్ఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే..5 గ్రామపంచాయతీలు, 107వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. సర్పంచ్ ఎన్నిక నుంచి 7,584 మంది.. వార్డుల్లో 10,427 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మొదటి విడతతో కలిపి 810 మంది సర్పంచ్‌లు, 17, 635 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

# ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**: ఎంపీ చామల**

హైదరాబాద్: ఇండిగోఎయిర్ లైన్స్‌పై కేంద్ర ప్రభుత్వం, విమానయాన శాఖ చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ డిమాండ్ చేశారు. విమాన ప్రయాణికుల ఇబ్బందులపై ఆయన మీడియాతో మాట్లాడారు. ''దేశ వ్యాప్తంగా విమాన ప్రయాణికులు ఇబ్బందులు పడటానికి ఇండిగో యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రధాన కారణం. గతేడాది డీజీసీఏ కొత్త రూల్స్ తెచ్చింది. ఆ నిబంధనలు అమలు కాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఇండిగో ఒత్తిడి తెచ్చింది. కొత్త రూల్స్ అమలయితే పైలట్లు ఎక్కువమందిని తీసుకోవాల్సి వస్తుందని ఇండిగో ఎయిర్ లైన్స్ భావించింది. ఏవియేషన్ ఇండస్ట్రీలో



ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు 60శాతానికిపైగా వాటా ఉంది. డీజీసీఏ కొత్త రూల్స్‌పై ఇండిగో ఎయిర్ లైన్స్ కోర్టుల చుట్టూ తిరిగి కాలయాపన చేసింది. కొత్త నిబంధనలు అమలు చేయాలని కేంద్రం భావించినప్పుడు ఇండిగో దగ్గర సరిపడా స్టాఫ్ ఉన్నారా? లేదా? ఎయిర్ క్రాఫ్ట్స్ ఎన్ని ఉన్నాయి? ఎంతమంది ప్రయాణికులు బుక్ చేసుకున్నారు? అనే ఆలోచన విమానయాన శాఖ చేయాల్సింది. దేశంలో 60 శాతానికి పైగా వాటా ఉంది కాబట్టే మాపైన ఆంక్షలు ఎట్లా పెడతారని ఇండిగో భావించింది ఇండిగో ఫ్లైట్స్ ఎగరకపోతే దేశ వ్యాప్తంగా ప్రజలకు నష్టం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం దిగి వస్తుందని ఆ సంస్థ పట్టుదలకు పోయింది. దేశ వ్యాప్తంగా విమాన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, కేంద్ర విమానయాన శాఖామంత్రి రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇండిగో ఎయిర్ లైన్స్‌పై కేంద్రం ప్రభుత్వం, విమానయాన శాఖ చర్యలు తీసుకోవాలి'' అని చామల కిరణ్ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ మోసాన్ని తట్టుకోలేకే ఈశ్వరాచారి ఆత్మహత్య

బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో కాంగ్రెస్ మోసాన్ని తట్టుకోలేక నిండు ప్రాణాలర్పించిన సాయి ఈశ్వరాచారికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సీనియర్ నాయకులు శుభప్రద్ పటేల్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో 42 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పంచాయతీ ఎన్నికల్లో కేవలం 17 శాతం మాత్రమే కేటాయించడంతో తీవ్ర మనస్థాపానికి గురై ప్రాణ త్యాగం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్ట బీరప్ప నగర్ లోని ఈశ్వరాచారి నివాసానికి వెళ్లి



ఆయన చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా దివంగత ఈశ్వరాచారి తల్లి ప్రమీల, సోదరుడు నందీశ్వర్,ఈశ్వరాచారి సతీమణి కవిత, కూతుళ్ల క్రితిక,సాయి చిట్టి, కుమారుడు సాయిదత్తాలను వారు ఓదార్చారు, పరామర్శించారు, తమతో పాటు పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.




# లాలాపేటలో రోడ్డు ప్రమాదం..
## ఇద్దరి మృతి

గౌతంనగర్ (హైదరాబాద్): నగరంలోని లాలాపేటలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యువకులు కీసర నుంచి అల్పాహారం కోసం తార్నాక వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతిచెందిన వారిలో హర్షవర్ధన్ అనే యువకుడు మల్కాజ్‌గిరి వాసిగా సమాచారం.

# పీటీఓ నూతన భవనానికి శంకుస్థాపన..
## డీజీపీ శివధర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ పోలీస్ రవాణా సంస్థ (పీటీఓ) ప్రాంగణంలో నూతన పీటీఓ భవన నిర్మాణానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. 21 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించేందుకు ప్రభుత్వం రూ.59 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు డీజీపీ తెలిపారు. అధునాతన భవనంలో వర్క్‌షాప్‌లు, డయాగ్నస్టిక్ సిస్టమ్స్, మెయింటెనెన్స్ బ్లాక్‌లు, ఆపరేషన్ జోన్‌లు ప్రత్యేక శిక్షణా మౌలిక సదుపాయాలు రూపుదిద్దుకోనున్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. టీజీ పోలీస్ సంక్షేమ ఫ్యూయల్ ఔట్‌లెట్ కూడా ప్రారంభించారు. ఔట్ లెట్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) భాగస్వామ్యంతో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో పోలీస్ రవాణా సంస్థ ఐజీపీ, టీజీపీఐసీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎం. రమేష్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఎస్పీ పీటీఓ రాజేష్ , ఐఓసీఎల్, ఈడీ పీయూష్ మిట్టల్, సీజీఎం బద్రీనాథ్, ముత్తు కుమరన్, సుదీప్తో మిత్ర పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీకి
# ప్రజలు శిక్షలు వేస్తూనే ఉన్నారు..



రేవంత్ రెడ్డి సీఎం కావడం రాష్ట్ర ప్రజల కర్మ అని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. హిల్ట్ కుంభకోణం బయటకు వచ్చిందని ఫ్రస్ట్రేషన్‌కు పోయి సీఎం రేవంత్ రెడ్డి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు ప్రజలు శిక్ష వేశారని రేవంత్ అంటున్నారని.. రాజకీయాలు గెలుపోటములు శిక్ష అయితే.. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి ప్రజలు శిక్షలు వేస్తూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో నల్గొండకు ఏం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీసీలో 8 మంది చనిపోతే ఇప్పటివరకు వారి శవాలు తీయలేని దద్దమ్మ రేవంత్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా 10 వేల మంది ఉపాధి ఇచ్చామని తెలిపారు.

# తెలంగాణ పర్యటన లైఫ్‌లాంగ్ గుర్తుండేలా గెస్ట్‌లకు గిఫ్ట్స్

రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే వివిధ కంపెనీలకు చెందిన 46 మంది ప్రతినిధులు తరలివస్తున్నారు. తొలిరోజు సోమవారం మధ్నాహ్నం



1.30 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సదస్సును లాంఛనంగా ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిధులు ప్రారంభ వేడుకకు హాజరవుతున్నారు. సదస్సులో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియాటెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షాతో పాటు ఇతరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సదస్సునుద్దేశించి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం వైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల సదస్సులో మొత్తం 27 అంశాలపై చర్చలు జరగనున్నాయి. అందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. సదస్సు నిర్వహిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణమంతా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. సదస్సులో పాల్గొనే ప్రతినిధులను ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణితో ప్రత్యేక సంగీత కచేరితో అలరించనున్నారు. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్క్ బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం సందర్శించేలా పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అతిధులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లతో కూడిన బహుమతిని అందించనున్నారు.

# ఇండిగో సంక్షోభం.. రూ.610 కోట్లమేర రీఫండ్ పూర్తి: కేంద్రం

రద్దయిన, ఆలస్యమైన 'ఇండిగో' విమానాల టికెట్ల రీఫండ్‌కు సంబంధించి ఇప్పటివరకు రూ.610 కోట్ల మేర చెల్లింపులు జరిగినట్లు పౌర విమానయానశాఖ ప్రకటించింది. ప్రయాణికులకు సంబంధించి శనివారం నాటికి ఆ సంస్థ దేశవ్యాప్తంగా 3,000 లగేజీలను డెలివరీ చేసిందని వెల్లడించింది. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఎటువంటి అదనపు ఫీజులు వసూలు చేయొద్దని తెలిపింది. పరిస్థితులు వేగంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నట్లు పేర్కొంది.




టికెట్ల రీఫండ్ ప్రక్రియను ఆదివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని, లగేజీని రెండు రోజుల్లో డెలివరీ అయ్యేలా చూడాలని కేంద్రం శనివారం ఇండిగోను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఇండిగో ఇప్పటికే ప్రకటించింది. సంక్షోభం నుంచి బయటపడటంతో పాటు సర్వీసుల పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకునేందుకు.. సీఈవో, బోర్డు సభ్యులు కలిసి క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. విమాన కార్యకలాపాల పునరుద్ధరణ విషయంలో దశలవారీగా పుంజుకుంటున్నట్లు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఆదివారం పరిస్థితి మరింత మెరుగుపడిందని, 1650 విమానాలు నడుపుతున్నట్లు వెల్లడించారు. సంస్థ 'ఆన్ టైమ్ పెర్ఫార్మెన్స్' నేడు 75 శాతంగా ఉండే అవకాశం ఉందని సిబ్బందికి పంపిన వీడియో సందేశంలో చెప్పారు. 138 విమానాశ్రయాల్లో 137 చోట్ల సేవలందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. పరిస్థితులను చక్కదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకున్నట్లు పౌరవిమానయానశాఖ సైతం స్పష్టం చేసింది.




## చైనాతో ఘర్షణ జరిగిన ఐదేళ్ల తర్వాత గల్వాన్ యుద్ధ స్మారకం..!

ప్రపంచంలో అత్యధిక ఎత్తులో నిర్మించిన యుద్ధస్మారకాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఆవిష్కరించారు. దీనిని గల్వాన్ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన భారత వీరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. లద్ధాఖ్‌లోని కేఎం 120 ష్యోక్‌దౌలత్‌బేగ్ ఓల్డీ మార్గంలో దీనిని నిర్మించారు. ప్రపంచంలో సైనిక మోహరింపులు జరిగే అత్యంత కఠినమైన యుద్ధక్షేత్రంగా దీనికి పేరుంది. సున్నా డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉండే ఈ ప్రాంతంలో దీనిని 'భారత్ రణ్‌భూమి దర్శన్' కార్యక్రమం కింద నిర్మించారు. ఈ ఏడాది ఆర్మీ దినోత్సవం నాడు దీనికి సంబంధించిన ప్రకటన వెలువడింది. ఈ యుద్ధ స్మారకాన్ని ఎరుపునలుపు రంగు గ్రానైట్ రాళ్లతో నిర్మించారు. ఇవి త్యాగం, వీరత్వానికి చిహ్నంగా నిలిచాయి. త్రిశూల్ డమరు మోడల్‌లో ఇవి ఉన్నాయి. దీంతోపాటు మన అమరవీరులకు గుర్తుగా కాంస్యంతో చేసిన 20 బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇక ఈ యుద్ధ స్మారకం కాంప్లెక్సులో మ్యూజియం, గల్వాన్ ఘటనను తెలియజేసే డిజిటల్ గ్యాలరీ, లద్ధాఖ్ సైనిక చరిత్రను తర్వాత తరాలకు అందించేలా ఏర్పాటు చేశారు. 2020 జూన్ 15వ తేదీన రాత్రి భారత్‌చైనా దళాల మధ్య గల్వాన్‌లో భీకర ఘర్షణ చోటుచేసుకొంది. ఇరు దేశాల మధ్య దాదాపు కొన్ని దశాబ్దాల తర్వాత చోటుచేసుకొన్న రక్తపాతం ఇది.

## సరిహద్దు రహదారులు..
## జాతీయ భద్రతకు జీవనాధారాలు: రాజ్‌నాథ్ సింగ్

లేహ్: 'సరిహద్దు రహదారులు.. జాతీయ భద్రతకు జీవనాధారాలు' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అత్యవసర సమయాల్లో సత్వరం స్పందించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో రూ.5000 కోట్లతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ నిర్మించిన 125 ప్రాజెక్టులను ఆదివారం ఆయన జాతికి అంకితం చేశారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పడానికి ఈ ప్రాజెక్టులే ఉదాహరణలని అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్ము, కశ్మీర్‌తోపాటు సరిహద్దు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం,



హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మిజోరంలలో వ్యూహాత్మకంగా 28 రహదారులు, 93 వంతెనలు, మరో నాలుగు ఇతర ప్రాజెక్టులను బీఆర్‌వో నిర్మించింది. ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా జమ్ముకశ్మీర్‌లోని లేహ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. మన సైనికుల శౌర్యం, ధైర్యం మనందరికీ స్ఫూర్తి అని, దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ఈ ప్రాజెక్టులు అంకితమని అన్నారు. రోడ్డు నెట్‌వర్క్, రియల్ టైమ్ కమ్యూనికేషన్, ఉపగ్రహ ఆధారిత నిఘా తదితర సౌకర్యాలు మన సైనికులు మరింత వేగంగా, సమర్థంగా పని చేసేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా నూతన సాంకేతికతను వినియోగించి, సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసినందుకు 'బీఆర్‌వో'ను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. సాయుధ బలగాలతోపాటు బీఆర్‌వో సిబ్బంది, సరిహద్దు ప్రాంతాల పౌరులు జాతీయ భద్రతలో భాగస్వాములవుతున్నారని కితాబిచ్చారు. ఇదే స్ఫూర్తి కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లద్దాఖ్‌లోని దర్బుక్ ష్యోక్ దౌలత్ బెగ్ ఓల్డి మధ్య 920 మీటర్ల పొడవున నిర్మించిన సొరంగం గురించి రాజ్‌నాథ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని కొనియాడారు. వాతావరణపరంగా ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా రవాణాకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా దీనిని నిర్మించినట్లు చెప్పారు. అంతేకాకుండా హిమపాతాల సమయంలోనూ సైన్యం ఆయుధాలు రవాణా చేసేందుకు ఇది వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందన్నారు.

## సామూహిక గీతా పారాయణం.. లక్షలాది మంది హాజరు!

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఆదివారం శ్రీకృష్ణ నామస్మరణ, శంఖనాదాలతో మార్మోగింది. చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సామూహిక గీతా పారాయణానికి లక్షలాది మంది హాజరయ్యారు. 'సనాతన సంస్కృతి సంసద్' అనే సంస్థ 'ఐదు లక్షల స్వరాలతో గీతా పారాయణం' పేరిట ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. బెంగాల్‌తోపాటు పరిసర రాష్ట్రాల ప్రజలు, వివిధ మఠాలకు చెందిన సాధువులు తదితరులు పెద్దఎత్తున తరలివచ్చారు. దేశంలోనే ఇది అతిపెద్ద సామూహిక గీతా పారాయణమని భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్, కేంద్రమంత్రి సుకాంత మజుందార్ తదితరులు పాల్గొని భగవద్గీత శ్లోకాలు పఠించారు. అనంతరం



శాంతి, అహింసల గురించి మాట్లాడారు. రాష్ట్ర ఆధ్యాత్మిక వారసత్వాన్ని మరోసారి గుర్తుచేసేందుకు, పవిత్ర గ్రంథాల ద్వారా సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రద్దీ నిర్వహణ, భద్రత, అత్యవసర వైద్యసేవల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి 6.5 లక్షలమందికిపైగా హాజరైనట్లు భాజపా ప్రతినిధి అమిత్ మాలవీయ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.



## సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే..
## మళ్లీ రాజకీయాల్లోకి మాజీ క్రికెటర్ సిద్ధూ..!

మాజీ క్రికెటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూ తిరిగి రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేయనున్నట్లు తెలుస్తోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటారని ఆయన సతీమణి నవ్‌జోత్ కౌర్ సిద్ధూ పేర్కొన్నారు. ఏ పార్టీకి చెల్లించేందుకు తమ వద్ద నిధులు లేవని ఆమె వెల్లడించారు. కానీ, తాము అధికారంలోకి వస్తే మాత్రం పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామని వెల్లడించారు. "మేము ఎప్పుడూ పంజాబ్, పంజాబియత్ కోసం గళం విప్పుతాము. కానీ, ముఖ్యమంత్రి సీట్లో కూర్చోవడానికి రూ.500 కోట్లు చెల్లించే స్థోమత లేదు'' అంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దిగజారడంపై గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను కలిసిన అనంతరం కౌర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే.. తమను డబ్బు ఎవరు డిమాండ్ చేశారో మాత్రం వెల్లడించలేదు. "రూ.500 కోట్లు ఇచ్చిన వ్యక్తి మాత్రం సీఎం అవుతాడు'' అని వ్యాఖ్యానించారు.

## మూడేళ్లుగా కరెంటు బిల్లు కట్టని తేజ్‌ప్రతాప్ యాదవ్..!

బిహార్ ఎన్నికల్లో ఓటమి, కుటుంబ కలహాల నేపథ్యంలో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్ పేరు ప్రముఖంగా వినిపించింది. తాజాగా ఆయనకు సంబంధించిన మరో విషయం వెలుగులోకి వచ్చింది. తేజ్ ప్రతాప్‌కు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ మొత్తం రూ.3.6 లక్షలు దాటినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం తేజ్‌ప్రతాప్ ప్రభుత్వ



నివాసంలో ఉంటున్నారు. అయితే, పట్నాలో ఆయనకు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి చివరిసారిగా 2022 జులైలో కరెంటు బిల్లు చెల్లించారు. గత మూడేళ్లుగా దీనికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయి. జరిమానాలతో కలిపి ఇప్పుడా మొత్తం కరెంటు బిల్లు రూ.3,61,000కు చేరింది. ఇక తేజ్‌ప్రతాప్ పేరు మీద మరో కరెంట్ కనెక్షన్ ఉన్నట్లు విద్యుత్తు శాఖ డేటా వెల్లడిస్తోంది. దీనికి సంబంధించిన బకాయిలు కూడా జరిమానాలతో కలిపి రూ.3,24,974 చెల్లించాల్సి ఉంది. ఈ వ్యవహారం కాస్త రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతోంది. బకాయిలు పేరుకుపోకుండా ఉండేందుకు బిహార్ ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ.. తేజ్ ప్రతాప్ తన నివాసానికి పోస్ట్‌పెయిడ్ మీటర్‌నే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం.. రూ.25వేల కంటే ఎక్కువ బిల్లు ఉంటే ఏ పోస్టుపెయిడ్ కనెక్షన్ అయినా డీయాక్టివ్ చేయాలి. అలాంటిది.. తేజ్‌ప్రతాప్ పేరు మీద ఉన్న విద్యుత్తు కనెక్షన్‌ల బకాయిలు రూ.3లక్షలు దాటినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడీ వ్యవహారం కాస్త చర్చనీయాంశంగా మారింది. ఇక బకాయి చెల్లింపులకు సంబంధించి చర్యలు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు.

## భారత విదేశాంగ మంత్రిపై పాకిస్థాన్ అక్కసు

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌పై పాకిస్థాన్ మరోసారి నోరు పారేసుకుంది. పాక్ సైన్యంతోనే భారత్‌కు ఎక్కువ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొనడం సరికాదని తెలిపింది. తమ వ్యవస్థలను, నాయకత్వాన్ని కించపరిచేలా విదేశాంగ మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయని, వాటిని ఖండిస్తున్నామని తెలిపింది. సైన్యం సహా వ్యవస్థలన్నీ తమ జాతీయ భద్రతకు మూలస్తంభాలని పాక్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి తాహిర్ పేర్కొన్నారు. ఓ జాతీయ వార్తా సంస్థ ఇటీవల నిర్వహించిన సమిట్‌లో పాల్గొన్న ఎస్ జైశంకర్‌కు.. పాకిస్థాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ గురించి ప్రశ్న ఎదురైంది. ఇందుకు ఆయన బదులిస్తూ.. పాక్ సైన్యంపై విమర్శలు గుప్పించారు. దాని



నిజస్వరూపం మనకు తెలుసని.. దానివల్లే మన దేశానికి సమస్యలు వచ్చి పడుతున్నాయని వ్యాఖ్యానించారు. వీటిపైనే దాయాది స్పందిస్తూ మరోసారి అక్కసు వెళ్లగక్కింది.

## ఇరుకైన మార్గాలు, తాటాకు అలంకరణలు..
## గతంలో క్లబ్ కూల్చివేతకు నోటీసులు..!

ఉత్తర గోవాలోని అర్పోరాలో ఉన్న 'బర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఈ క్లబ్‌నకు సంబంధించిన పలు ఉల్లంఘనలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. అగ్నిప్రమాద సమయంలో ఇరుకైన మార్గాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు తెలుస్తోంది. అలంకరణకు ఉంచిన తాటాకులకు మంటలు అంటుకోవడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ప్రమాద సమయంలో అక్కడ 'బాలీవుడ్ బ్యాంగర్ నైట్'ను ఏర్పాటు చేసినట్లు నైట్ క్లబ్ ఇన్‌స్టా పోస్టు ద్వారా తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. 'తెల్లవారుజామున 1 గంటలకు భారీ శబ్దం వచ్చింది. ఆ సమయంలో డ్యాన్స్ ఫ్లోర్‌పై 100 మందికి పైగా ఉన్నారు. అకస్మాత్తుగా



మంటలు రావడంతో.. గందరగోళం ఏర్పడింది. పర్యాటకులు ప్రాణభయంతో పరుగులు తీశారు. మరికొందరు వంటగదిలోకి పారిపోయారు. ఈ క్రమంలో క్లబ్ మొత్తం మంటలు వ్యాపించాయి. పొగ కారణంగా అనేక మంది మరణించారు' అని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అలంకరణ కోసం తాటాకులతో తయారుచేసిన నిర్మాణాలు ఉన్నాయని.. వాటికి మంటలు అంటుకోవడంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని ఓ పర్యాటకురాలు వెల్లడించారు.

**క్లబ్ కూల్చివేతకు నోటీసులు..!**

బ్యాక్ వాటర్స్ సమీపంలో ఈ క్లబ్ ఉంది. దీని లోపలకి వెళ్లి, వచ్చే మార్గాలు చాలా ఇరుకుగా ఉన్నాయి. దీంతో మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక యంత్రాలు లోపలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. దాదాపు 400 మీటర్ల దూరంలోనే వాటిని ఉంచాల్సి వచ్చింది. ఈ క్రమంలో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగిందని సీనియర్ ఫైర్ ఆఫీసర్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఇదిలాఉండగా.. క్లబ్ నిర్వాహకుల మధ్య వివాదాలు ఉన్నాయని స్థానిక సర్పంచ్ రోషన్ రెడ్కర్ తెలిపారు. వారు పరస్పరం పంచాయితీలో ఫిర్యాదు చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో క్లబ్ కూల్చివేతకు నోటీసులు కూడా జారీ చేసినట్లు చెప్పారు.

## కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం..
## ఆదివారం 650 విమానాలు రద్దు..!



**న్యూఢిల్లీ:** ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభం కొనసాగుతున్నాయి. ఆరో రోజు ఆదివారం దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాల్లో 650 విమానాలు రద్దయ్యాయి. ఇండిగోలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా గత ఆరు రోజుల్లో దాదాపు 3వేలకుపైగా విమానాలు రద్దయ్యాయి. దాంతో దేశంలో విమాన రాకపోకలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. లక్షలాది మంది ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నది. మరో వైపు ఇండిగోపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సంక్షోభంపై 24గంటల్లో స్పందించాలని పేర్కొంటూ డీజీసీఏ శనివారం ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, సీవోవో, అకౌంటబుల్ మేనేజర్ పోర్కెరాస్‌లకు షో కాజ్ నోటీసులు జారీ చేసింది. కార్యాచరణ ప్రణాళిక, వనరుల నిర్వహణలో గణనీయమైన వైఫల్యం వల్లనే ఈ సంక్షోభం తలెత్తిందని డీజీసీఏ నోటీసుల్లో పేర్కొంది.

ఇండిగోలో కొనసాగుతున్న సంక్షోభానికి ప్రధాన కారణం కొత్త ఎఫ్‌డీటీఎల్ రూల్స్‌ను అమలు చేసేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడమేనని.. దాంతో విమానయాన సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ నోటీసుల్లో ప్రశ్నించింది. ఇండిగో సర్వీస్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో పౌర విమానయాన మంత్రి కే రామ్మోహన్ నాయుడు శనివారం సీనియర్ మంత్రిత్వశాఖ అధికారులు పీటర్ ఎల్బర్స్‌తో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. మరో వైపు ఏవియేషన్ మినిస్ట్రీ ప్రయాణికులకు పెండింగ్‌లో ఉన్న అన్ని రీఫండ్స్‌ను ఆదివారం రాత్రి 8 గంటల్లోగా క్లియర్ చేయాలని ఆదేశించింది. విమానాల రద్దు నేపథ్యంలో ప్రభావితమైన ప్రయాణికుల నుంచి రీషెడ్యూలింగ్‌కు ఎలాంటి ఫీజులు వసూలు చేయొద్దని స్పష్టం చేసింది. ఫిర్యాదులను పరిష్కరించేందుక, రియల్ టైమ్ అప్‌డేట్స్ అందించేందుకు ప్రయాణికులకు స్పెషల్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

## బిగ్ అలర్ట్.. ఐటీఆర్ నుంచి ఆధార్-పాన్ లింక్ సహా ఈ పనులకు 31 వరకే గడువు..



**న్యూఢిల్లీ:** 2025 సంవత్సరం చివరి నెల, డిసెంబర్ ప్రారంభం కావడంతో, అనేక ముఖ్యమైన పనులకు గడువులు దగ్గర పడుతున్నాయి. మీరు పాన్-ఆధార్ లింకింగ్, ముందస్తు పన్ను లేదా ఐటీఆర్‌కు సంబంధించిన పనులను వాయిదా వేస్తుంటే, ఇప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది.

డిసెంబర్ 31 నాటికి ఈ పనులు పూర్తి కాకపోతే, బ్యాంకింగ్, పెట్టుబడి నుండి పన్ను దాఖలు వరకు అనేక సమస్యలు తలెత్తవచ్చు. ఈ 4 ముఖ్యమైన పనులను సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

### ఐటీఆర్ దాఖలుకు చివరి తేదీ డిసెంబర్ 10

ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేయడానికి చివరి తేదీ డిసెంబర్ 10, 2025. ఈ తేదీలోపు మీ రిటర్న్‌ను దాఖలు చేయడం సకాలంలో జరిగినట్లు పరిగణిస్తారు. అతిపెద్ద ఉపశమనం ఏమిటంటే గడువులోపు దాఖలు చేసిన రిటర్న్‌లకు ఎటువంటి ఆలస్య రుసుములు లేదా జరిమానాలు ఉండవు.

### ముందస్తు పన్ను గడువు డిసెంబర్ 15

తగ్గించిన తర్వాత అంచనా వేసిన ట్యాక్స్ లయబిలిటీ రూ.10,000 దాటిన వారు ముందస్తు పన్ను చెల్లించాలి. గడువు డిసెంబర్ 15. ఆలస్యం చేస్తే వడ్డీ, జరిమానాలు విధించవచ్చు, కాబట్టి సకాలంలో పన్ను చెల్లించడం ఉత్తమం.

### లేట్ ఐటీఆర్ దాఖలు గడువు డిసెంబర్ 31

మీరు 2024-25 ఆర్థిక సంవత్సరానికి మీ ఐటీఆర్‌ను ఇంకా దాఖలు చేయకపోతే, టెన్షన్ పడకండి. మీకు ఇంకా అవకాశం ఉంది. అయితే, ఈ అవకాశం ఆలస్య రుసుముతో వస్తుంది.

5 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు 1,000 రూపాయల ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది. 5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారికి 5,000 రూపాయల జరిమానా విధిస్తారు. గమనించదగ్గ విషయం ఏమిటంటే ఈ గడువు తప్పినట్లయితే రిటర్న్ దాఖలు చేయలేరు.

### డిసెంబర్ 31 నాటికి ఆధార్-పాన్ లింక్ తప్పనిసరి

మీ ఆధార్ అక్టోబర్ 1, 2024న లేదా అంతకు ముందు తీసుకున్నదైతే డిసెంబర్ 31లోపు దానిని మీ పాన్ కార్డ్‌తో లింక్ చేయడం అవసరం. దీన్ని ఆలస్యం చేయడం వలన మీ పాన్ డీయాక్టివేట్ అవుతుంది. ఇది మీ బ్యాంకింగ్, పెట్టుబడి, డీమ్యాట్, ఐటీఆర్ ఫైలింగ్‌కు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. లింక్ చేసే ప్రక్రియ చాలా సులభం. ఆదాయపు పన్ను ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో మీ పాన్, ఆధార్, నమోదు చేయడం ద్వారా నిమిషాల్లో దీన్ని పూర్తి చేయవచ్చు.

## వరుసగా రెండవ వారం పడిపోయిన భారత విదేశీ మారక నిల్వలు..

### పెరిగిన బంగారం నిల్వలు



**న్యూఢిల్లీ:** గత వారం రోజులుగా భారత విదేశీ మారక నిల్వలు తగ్గాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన డేటా ప్రకారం, నవంబర్ 28తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 1.877 బిలియన్ల క్షీణతను నమోదు చేసి, 686.227 బిలియన్లకు చేరుకున్నాయని ఆర్బీఐ తెలిపింది.

గత వారం 4.472 బిలియన్ల తగ్గుదల తర్వాత ఈ తగ్గుదల సంభవించింది. ఇది దేశంలోని ఫారెక్స్ హోల్డింగ్స్‌లో ఇటీవలి తగ్గుదల ధోరణిని కొనసాగిస్తోంది.

రిజర్వ్ బ్యాంక్ డేటా ప్రకారం, భారతదేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలలో అతిపెద్ద వాటా విదేశీ కరెన్సీ ఆస్తులు, ఇది 557 బిలియన్లు. ఇందులో 3.5 బిలియన్ల తగ్గుదల ఉంది. అయితే, బంగారు నిల్వల్లో పెరుగుదల ఉంది. 1.6 బిలియన్ల పెరుగుదల ఉంది. అది 105 బిలియన్లకు చేరుకుంది. సెప్టెంబర్ 27, 2024తో ముగిసిన వారం ప్రారంభంలో, మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు రికార్డు స్థాయిలో 704.885 బిలియన్ల వద్ద ఉండటం గమనించదగ్గ విషయం.

# బెంగళూరులో కొత్త స్టేడియం..



### ఈసారి చిన్నస్వామిలోనే ఐపీఎల్ మ్యాచ్‌లు..!

**బెంగళూరు:** ఆర్సీబీ విక్టరీ పరేడ్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనతో చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌లకు దూరమైంది. పదకొండు మంది మృతికి కారణమైనందున కోర్టు కేసు.. పోలీసులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో.. ఆరు నెలలుగా ఇక్కడ ఒక్క మ్యాచ్ జరగడం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌లను కూడా చిన్నస్వామి నుంచి తరలిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్నస్వామి స్టేడియం బెంగళూరుకు గర్వకారణమని చెప్పిన ఆయన.. ఎలాగైనా రాష్ట్రంలో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని అన్నారు.

ఐపీఎల్‌లో తొలిసారి విజేతగా నిలిచిన ఆర్సీబీ జట్టు.. విజయ యాత్ర జూన్‌లో పెను విషాదానికి దారి తీసింది. 30 వేల సామర్థ్యమున్న చిన్నస్వామి స్టేడియానికి 3 లక్షలమంది పోటెత్తారు. అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనేందుకు వచ్చిన అభిమానులను పోలీసులు అదుపు చేయలేకపోయారు. ఒక్కసారిగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు విడిచారు. ఈ సంఘటనతో చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లకు ఎండ్ కార్డ్ పడింది. జూన్ నుంచి.. మ్యాచ్‌ల పునరుద్ధరణ కోసం కర్నాటక క్రికెట్ సంఘం చేయని ప్రయత్నమంటూ లేదు. డిసెంబర్16న ఐపీఎల్ వేలం.. ఆ వెంటనే సీజన్ షెడ్యూల్ ప్రకటన వెలువడనున్న నేపథ్యంలో కర్నాటక ఉప-ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు.

'భవిష్యత్‌లో తొక్కిసలాట వంటి దుర్ఘటనలు జరగకుండా జాగ్రత్తపడుతాం. రాబోయే రోజుల్లో కర్నాటక క్రికెట్ స్టేడియం ఆధ్వర్యంలోని చిన్నస్వామిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తాం. చిన్నస్వామి మన బెంగళూరుకు గర్వకారణం. స్టేడియంలో మ్యాచ్‌లు ఆడించేటప్పుడు భారీగా అభిమానులను అనుమతించకుండా చర్యలు తీసుకుంటాం. అంతేకాదు చిన్నస్వామికి ప్రత్యామ్నాయంగా ఒక పెద్ద స్టేడియం నిర్మిస్తాం. నిరుడు తొక్కిసలాట తర్వాత నెలకొన్న పరిస్థితులతో ఐపీఎల్ మ్యాచ్‌లను బెంగళూరు నుంచి తలరిస్తారనే వార్తలు వస్తున్నాయి. అయితే.. ఇప్పటికిప్పుడు అలాంటి నిర్ణయం తీసుకోరని అనుకుంటున్నా. చిన్నస్వామిలోనే ఐపీఎల్ ఆడిస్తాం. అందుకు అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం' అని శివకుమార్ తెలిపారు.

**ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటేనే**

బెంగళూరు నడిబొడ్డున 17 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన చిన్నస్వామి స్టేడియంలో భద్రతా లోపాలు ఉన్నాయని ఏకసభ్య కమిషన్ తీర్పునిచ్చింది. అందుకని పోలీసులు కర్నాటక క్రికెట్ సంఘానికి ఎన్‌ఓసీ ఇవ్వడం లేదు. దాంతో.. స్వతంత్ర సభ్యుడి నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేలా కర్నాటక ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఒకవేళ.. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈసారి కూడా చిన్నస్వామిలో ఐపీఎల్ మ్యాచ్‌లు జరగడం ఖాయం.

## సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న విరాట్ కోహ్లీ



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ సింహాచలం వరాహ లక్ష్మీ వరాహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. విశాఖపట్నంలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడేందుకు వచ్చిన విరాట్.. ఆదివారం ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విరాట్‌కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో విరాట్‌కు స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందించి, శేషవస్త్రంతో సత్కరించారు. స్వామి వారికి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా విరాట్ మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకొని ఎంతో పారవశ్యానికి లోనైనట్లు విరాట్ తెలిపాడు. దర్శనం చేయించినందుకు, తీర్థ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందించినందుకు ఆలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు.

ఇదిలా ఉండగా.. దక్షిణాఫ్రికాతో విశాఖపట్నం వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 2-1 తేడాతో సిరీస్‌ను నెగ్గింది. అంతకు ముందు దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌ను ఓడిపోయిన విషయం తెలిసిందే. తాజాగా వన్డే సిరీస్‌ను నెగ్గడంతో టీమిండియాకు ఊరటనిచ్చింది. శనివారం జరిగిన మూడో వన్డేలో టీమిండియా తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సఫారీలు నిర్దేశించిన 271 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 39.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 271 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 121 బంతుల్లో 116 పరుగులతో నాటౌట్‌గా నిలువగా.. రోహిత్ శర్మ 73 బంతుల్లో 75 పరుగులు చేశాడు. ఇక టీమిండియా కింగ్ కోహ్లీ ఈ మ్యాచ్‌లో 45 బంతుల్లో 65 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మూడు ఫోర్లు, ఆరు సిక్సర్లతో హాఫ్ సెంచరీ చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ సిరీస్‌లో కోహ్లీ అందరి దృష్టిని ఆకర్షించాడు. మూడు మ్యాచుల సిరీస్‌లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ సహాయంతో.. 151.00 సగటుతో 302 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. ఇక విరాట్‌ను చూసేందుకు స్టేడియం నుంచి హోటల్ వరకు ప్రతిచోటా అభిమానులు తరలివచ్చారు. ఇక విరాట్ మళ్లీ జనవరిలో మళ్లీ మైదానంలో కనిపించనున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగనున్న సిరీస్‌లో ఆడనున్నాడు.

## టీమిండియా మాజీ కోచ్‌కు కీలక బాధ్యతలు..

### నమీబియా గెలుపు పట్టాలెక్కేనా..?



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ ఖరారు కావడంతో అన్ని జట్లు సన్నాహక మ్యాచ్‌లతో బిజీగా ఉన్నాయి. మెగా టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శనే లక్ష్యంగా కోచింగ్ సిబ్బందిని బలోపేతం చేసుకుంటున్నాయి. ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ నమీబియా క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దిగ్గజ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌ను తమ జట్టుకు 'కన్సల్టెంట్'గా నియమించింది. టీమిండియాకు 2011లో వన్డే వరల్డ్ కప్ కట్టబెట్టిన కిర్‌స్టెన్ నమీబియాను విజయాల బాట పట్టిస్తాడని ఆ దేశ బోర్డు భావిస్తోంది. పొట్టి క్రికెట్‌లో సంచలన విజయాలతో దూసుకొచ్చిన నమీబియా 2026 ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించింది. ఈ మెగా టోర్నీలో ఈ ఆఫ్రికా జట్టు ఆడడం ఇది మూడోసారి. 2021, 2022, 2024 ఎడిషన్లలో పాల్గొన్న నమీబియా ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉంది. సో.. అంతర్జాతీయ క్రికెట్‌లో కోచ్‌గా సుదీర్ఘ అనుభవమున్న గ్యారీ కిర్‌స్టెన్‌ను కన్సల్టంట్‌గా తీసుకుంది నమీబియా క్రికెట్. తనను నమీబియా జట్టుకు కన్సల్టంట్‌గా నియమించడం పట్ల కిర్‌స్టెన్ సంతోషం వ్యక్తం చేశాడు. 'నమీబియా క్రికెట్‌తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. క్రికెటర్ల ప్రదర్శన మెరుగవ్వడం కోస అంకితభావం, పట్టుదలగా నమీబియా బోర్డు పనిచేయడం చూసి చాలా ఇంప్రెస్ అయ్యాను. కొత్తగా నిర్మించిన స్టేడియం వారికి క్రికెట్ మీదున్న ఆసక్తికి నిదర్శనం. నమీబియా పురుషుల సీనియర్ సెలెక్టర్ల పనితీరు గొప్పగా ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగబోయే టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న నమీబియాకు నా వంతు సహకారం అందిస్తాను' అని కిర్‌స్టెన్ వెల్లడించాడు.

ప్రస్తుతం నమీబియా హెడ్‌కోచ్‌గా సేవలందిస్తున్న క్రెగ్ విలియమ్స్‌తో కలిసి కిర్‌స్టెన్ నమీబియా క్రికెట్ బలోపేతానికి కృషి చేయనున్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు కోచ్‌గా వ్యవహరించిన ఈ దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ .. అనంతరం పాకిస్థాన్ కోచ్‌గానూ నియమితులయ్యాడు. కానీ, క్షమశిక్షణలేని పాక్ సీనియర్లు, బోర్డు రాజకీయాలను భరించలేక ఆరు నెలలకే రాజీనామా చేశాడు.

# పెళ్లిని రద్దు చేసుకున్న స్మృతి మంధాన-పలాష్ ముచ్చల్..



**న్యూఢిల్లీ:** అందరూ ఊహించినట్లుగా టీమిండియా వుమెన్స్ క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాష్ ముచ్చల్ రద్దయ్యింది. సోషల్ మీడియా వేదికగా ఇద్దరూ పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్లుగా ఇద్దరూ అధికారికంగా ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం 1.08 గంటల సమయంలో స్మృతి మంధాన ఇన్‌స్టాగ్రామ్ వేదిక పోస్ట్ పెట్టింది. పలాష్‌తో పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. గత కొన్నివారాలుగా తన జీవితం గురించి ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయని.. ఈ సమయంలో బహిరంగంగా మాట్లాడడం ముఖ్యమని భావిస్తున్నాను.

వివాహం రద్దయ్యిందని.. ఈ విషయాన్ని ఇక్కడే ముగించాలనుకుంటున్నాను. ఈ సమయంలో రెండు కుటుంబాల గోప్యతను గౌరవించాలి. ముందుకు సాగేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాను. మనందరి వెనుక ఒక గొప్ప ఉద్దేశ్యం ఉందని నేను నమ్ముతున్నాను. నా దేశానికి ప్రాతినిథ్యం వహించాలని కోరుకుంటున్నాను. వీలైనంత కాలం భారత్ తరఫున ఆడటం కొనసాగించాలని, ట్రోఫీలు గెలవడం కొనసాగించాలని ఆశిస్తున్నాను. ఎప్పుడూ నా దృష్టి దానిపైనే ఉంటుంది. మద్దతుగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు, ఇకపై ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది.' అంటూ స్మృతి పోస్ట్ పెట్టింది.

ఆ తర్వాత పులాష్ సైతం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్లుగా తెలిపారు. 'నా జీవితంలో ముందుకు సాగాలనుకుంటున్నాను. నా వ్యక్తిగత సంబంధం నుంచి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాను. తనకు అత్యంత పవిత్రమైన వ్యక్తిగత విషయంపై నిరాధారమైన పుకార్లకు జనం తేలిగ్గా స్పందించడం చాలా కష్టంగా అనిపించింది. ఇది నా జీవితంలో అత్యంత క్లిష్టమైన దశ. తన విశ్వాసాలను పట్టుకుని గౌరవంగా ఈ పరిస్థితిని ఎదుర్కొంటా'నని పలాష్ ముచ్చల్ పోస్ట్ పెల్లాడు. అయితే, పరువు నష్టం కలిగించేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేసిన వారిపై తన బృందం న్యాయపరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన ధన్యవాదాలు తెలిపారు.

ఇదిలా ఉండగా.. గత కొంతకాలంగా ఇద్దరు ప్రేమలో ఉండగా.. ఇటీవల పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. నవంబర్ 21న హల్దీ వేడుక జరిగింది. స్మృతితో పాటు షెఫాలి వర్మ, రిచా ఘోష్, శ్రేయంకా పాటిల్, రేణుకా సింగ్, శివాలి షిండే, రాధా యాదవ్, జెమీమా వంటి క్రీడాకారిణులు హాజరయ్యారు. నవంబర్ 22న, స్మృతి-పలాష్ మెహందీ వేడుక జరిగింది. నవంబర్ 23న సాంగ్లిలో వివాహానికి అన్ని సన్నాహాలు పూర్తయ్యాయి. భారత జట్టు మహిళా క్రికెటర్లతో పాటు వీఐపీలు వివాహానికి తరలివచ్చారు. అయితే, నవంబర్ 23న సాయంత్రం స్మృతి అస్వస్థతకు గురయ్యారు. దాంతో వివాహాన్ని వాయిదా వేశారు. అయితే, పలాష్ సైతం ఆసుపత్రిలో చేరాడు. ఆ సమయంలో పెళ్లి రద్దు చేసుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. తాజాగా ఇద్దరు పెళ్లిని క్యాన్సిల్ చేసుకున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. ఎందుకు పెళ్లిని రద్దు చేసుకున్నారో మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.

## MOVIE TIME



# 'శశిరేఖ' వచ్చేసింది..

### 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి సెకండ్ సింగిల్ రిలీజ్

**టాకీస్:** అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవర ప్రసాద్' చిత్రం నుంచి తాజాగా రెండో పాటను విడుదల చేశారు మేకర్స్. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'మీసాల పిల్ల' భారీ విజయాన్ని సాధించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తదుపరి పాట అప్‌డేట్‌తో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. 'శశిరేఖ' అనే పేరుతో వచ్చిన ఈ రెండో పాట ఆదివారం చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు భీమ్స్ సీసిరిలియో సంగీతం అందించాడు. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి అగ్ర తారలు నటించారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ (షైన్ స్క్రీన్స్) సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## తరుణ్ భాస్కర్ కొత్త సినిమా..
## 'ఓ శాంతి శాంతి శాంతి' టీజర్ వచ్చేది అప్పుడే




**టాకీస్:** దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ యువ సంచలనం తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ శాంతి శాంతి శాంతి'. మలయాళంలో వచ్చిన జయ జయ జయ జయహే సినిమాకు రీమేక్‌గా రాబోతుంది ఈ చిత్రం. ఈ సినిమాకు ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తుండగా సృజన్ యారబోలు, ఆదిత్య పిట్టే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 23న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమా టీజర్‌ను డిసెంబర్ 08న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కామెడీ కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోబోతుందని చిత్రబృందం తెలిపింది.

## గ్రాండ్‌గా లాంచ్ అయిన సూర్య 47

**టాకీస్:** కోలీవుడ్ స్టార్ యాక్టర్ సూర్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. ఇప్పటికే ఆర్జే బాలాజీ డైరెక్షన్‌లో కరుప్పు సినిమా చేస్తున్నాడు. బైలింగ్యువల్ మూవీగా రాబోతున్న ఈ చిత్రానికి సుశిన్ శ్యామ్ సంగీతం



ఇదిలా ఉంటే మరోవైపు సూర్య 47 ప్రాజెక్టును కూడా లైన్‌లో పెట్టాడు. ఈ చిత్రానికి మాలీవుడ్ మూవీ ఆవేశం ఫేం జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు.

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రేజీ వార్త వచ్చేసింది. సూర్య 47 చిత్రం పూజాకార్యక్రమం ఆదివారం చెన్నైలో గ్రాండ్‌గా జరిగింది. సూర్య అండ్ టీం, ఇతర సభ్యులు ఈవెంట్‌లో పాల్గొన్నారు. సూర్య ఈ చిత్రంలో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. మలయాళం, తమిళ అందిస్తున్నాడు. షూటింగ్‌కు సంబంధించిన వివరాలపై త్వరలో క్లారిటీ రానుంది.

మలయాళంలో యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఫహద్ ఫాసిల్ హీరోగా జీతూ మాధవన్ తెరకెక్కించిన ఆవేశం బాక్సాఫీస్ వద్ద రికార్డుల వర్షం కురిపించింది. మరి జీతూ మాధవన్ సూర్యతో సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్.




# ఆచితూచి అడుగేస్తున్న అందాల భామ..

టాకీస్: చాలా మంది హీరోయిన్ స్టార్ డమ్ కోసం ఎంతో కష్టపడుతూ ఉంటారు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ దూసుకుపోతున్నారు. ఇప్పటికే టాలీవుడ్ లో చాలా మంది హీరోయిన్స్ తమ అందాలతో ప్రేక్షకులను కవ్విస్తున్నారు. అలాగే తమ నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అలాగే చాలా మంది హీరోయిన్స్ ఇతర భాషల నుంచి వచ్చి టాలీవుడ్ లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంటున్నారు. ఈ చిన్నది కూడా వేరే భాష నుంచి వచ్చి తెలుగులో ప్రేక్షకులకు దగ్గరైంది. తెలుగులో ఈ బ్యూటీ చేసిందే తెలుగులో మూడు సినిమాలు.. వాటిలో ఒక ఒక్క సినిమా హిట్ అయ్యింది. మిగిలిన రెండు సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. కానీ తన అందంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఈ అమ్మడు తెలుగులో సినిమాలుతగ్గించడంతో అభిమానులు కూడా చాలా ఫీల్ అవుతున్నారు. అంతే కాదు మనకు వచ్చే లవర్ కూడా ఇలానే ఉండాలి అని కుర్రాళ్ళు అంతా అనుకునేలా తన అందంతో కవ్వించింది. ఇంతకూ ఆమె ఎవరో కాదు.. కళ్యాణి ప్రియదర్శన్. ఈ ముద్దుగుమ్మ అక్కినేని అఖిల్ హీరోగా నటించిన హలో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఈ సినిమా నిరాశపరిచింది కానీ.. కళ్యాణి తన నటనతో, అందంతో ఆకట్టుకుంది. హలో సినిమా తర్వాత సాయి ధరమ్ తేజ్ చిత్రలహరి సినిమాతో ఆకట్టుకుంది. చిత్రలహరి సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత శర్వానంద్ తో రణరంగం అనే సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా ప్రేక్షకులను నిరాశపరిచింది. ప్రస్తుతం ఈ చిన్నది మలయాళంలో సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది. తెలుగులో మంచి అవకాశం వస్తే చేయడానికి రెడీగా ఉంది. ఇక సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలు అభిమానులను, నెటిజన్స్ ను ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

### నా దారి రహదారి
# అంటున్న నరసింహా..



### తలైవా మళ్లీ వచ్చేస్తున్నాడు

**టాకీస్:** ప్రతీ యాక్టర్ కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాలుండటం చూస్తూనే ఉంటాం. అయితే ఇండస్ట్రీని షేక్ చేసి ట్రెండ్ చేసిన సినిమాలు అరుదుగా వస్తుంటాయి. అలాంటి ఆణిముత్యాల్లో ఒకటి నరసింహ. తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం నరసింహ. కేఎస్ రవికుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీలో శివాజీ గణేశన్, రమ్యకృష్ణ, సౌందర్య కీలకపాత్రల్లో నటించారు. 1999లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీ ఇప్పటికీ ఎప్పటికీ ఆల్‌టైం ఫేవరేట్‌గా నిలుస్తుందని.. సినిమాలో వచ్చే డైలాగ్స్ చెప్పేస్తాయి. కాగా సిల్వర్ స్క్రీన్‌పై మరోసారి ఈ మ్యాజిక్‌ను చూడాలనుకునే వారి కోసం అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. రజినీకాంత్ బర్త్ డే సదర్భంగా 2025 డిసెంబర్ 12న థియేటర్లలో గ్రాండ్‌గా రీరిలీజ్ చేస్తున్నట్టు సౌందర్య రజినీకాంత్ ట్వీట్ చేసింది. అప్పట్లో ఈ చిత్రం 200కుపైగా థియేటర్లలో గ్రాండ్‌గా స్క్రీనింగ్ అయింది. మళ్లీ పాతికేళ్ల తర్వాత థియేటర్లలోకి రాబోతున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతుందని సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇంకేంటి మరి మరోసారి నరసింహను సిల్వర్ స్కీన్‌పై చూసేందుకు రెడీగా ఉండండి. 50 వసంతాలు.. వన్ అండ్ ఓన్లీ రజినీకాంత్.. తన చరిష్మా, మ్యానరిజం, హ్యూమానిటీతో, బిగ్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేశారు. ఆయన నటించిన ఐకానిక్ క్రియేషన్స్‌లో ఒకటి. సూపర్ స్టార్ స్వయంగా నటిస్తూ నిర్మించిన చిత్రం పడయప్ప 25 ఏండ్ల మళ్లీ మీ ముందుకు అంటూ షేర్ చేసిన గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతోంది.

## కిచ్చా సుదీప్ కొత్త మూవీ
# 'మార్క్' ట్రైలర్ విడుదల



**టాకీస్:** కన్నడ స్టార్ నటుడు కిచ్చా సుదీప్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ డ్రామా చిత్రం 'మార్క్'. ఈ సినిమాను దర్శకుడు విజయ్ కార్తికేయ రూపొందించారు. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా తెలుగు, కన్నడ, తమిళం భాషల్లో ట్రైలర్లను విడుదల చేసింది. ఈ ట్రైలర్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ట్రైలర్ చూస్తుంటే.. సుదీప్ ఇందులో ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. అనుకోకుండా చిన్నపిల్లలు మిస్ అయ్యి చనిపోతుండగా.. ఈ కేసును సుదీప్ ఎలా చేధించాడు అనేది ఈ సినిమా కథ అని టాక్. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.